

# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



*సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.*

*హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్ వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)*

*అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.*

# గుండమ్మ కథ - 3

గుండమ్మ భర్త ఫొటో వద్ద అతని పాదరక్షలను పూజిస్తూ వుంటుంది. పక్కనే సహాయానికి సవితి కూతురు లక్ష్మి.

గంటయ్య: చెల్లాయ్. తీసుకొచ్చేశాను.. రామభద్రయ్యగారు!

రా.భ: ఈ అమ్మాయేనా? —లక్ష్మిని పరికించి చూసి ——ఫొటోలో చూస్తే ఇంకో మాదిరిగావుందే?

గుండమ్మ: కుత్సితంగా−−ఇది మా పనిమనిషిలెండి. మా అమ్మాయి వేరేవుంది. —లక్ష్మితో——అలా మొహం వేసుకుని నిలబడతావేం? ఆ పళ్ళెం లోపలపెట్టు.——లక్ష్మి లోనికిపోతుంది.

గంట:: సరే——పోయి అమ్మాయిని తీసుకురా.

గుండ: మొహం ఇంత చేసుకుని సంతోషంగా−− అలాగే. వారిని కూర్చోబెట్టి మాట్లాడుతూవుండు. ఇప్పుడే తీసుకొస్తానన్నయ్యా. —లోనికి పోతుంది.

రామభద్రయ్య వెంకట్రామయ్య ఫొటో చూస్తాడు.

గంట: ఏవిఁటలా చూస్తారు? మా బావగారు. ఈమధ్యనే పోయినారు.

రా.భ: వీరిది పెద్దాపురం కదూ?

గంట: ఔను. ఇప్పటికీ వీరి ఆస్తంతా అక్కడేవుంది. మా చెల్లాయి వీరి రెండో భార్య. తల్లినివదిలి ఎక్కడికీ రానని ఈవిడ, ఊరువదిలి ఇల్లరికం రానని ఆయన− చాలాకాలం భీష్మించుకు కూర్చున్నారు. తర్వాత ఏముందీ.మాబావగారే వచ్చి ఇక్కడే ఉండిపోయారు.

సరోజ మేడమీద నిద్రలేచి ఆవులిస్తూ balustradeవద్దకి వచ్చి గారంగా: అమ్మా.కాఫీ.

గంట: అబ్బబ్బబ్బబ్బ. గారాల పెంపకం. ఇంట్లో పనీపాటా అలావుంచండి. పొద్దున్నే నిద్రలేస్తేనే అరిగిపోతుందని భయం. సంబంధాలు తేలేదు,తేలేదు అంటుంది. తెస్తే ఇదీ వరస. బుద్ధున్నవాడెవడైనా దీన్ని చేసుకుంటాడూ? ఈ అవతారం చూసి? ఛఛఛ!

రా.భ: గంటయ్యగారూ. మీకు మగపిల్లలు లేరా?

గంట: అడిగారూ? అడుగుతారు. బుద్ధున్నవాళ్ళు ఎవరైనా అడుగుతారు.

రా.భ: అబ్బే.తెలీక అడిగాను.

గంట: అబ్బే. తెలిసే అడుగుతున్నారులెండి. రామభద్రయ్యగారూ. సాటి పెద్దమనిషి. మీతో నేను ఎలా అబద్ధం ఆడగలను? రేపైనా, ఏమయ్యా గంటయ్యా. మాటమాత్రమైనా నాతో చెప్పలేదేం? అంటే నేనేమైపోతాను? నిజం చెప్పమనండి. నాకు ఒక్కడే కుమారుడు. చాలా ఆత్మాభిమానంగలవాడులెండి. ఇలాంటిపిల్లను చేసుకుని ఇల్లరికం ఉండమంటే వాడుమాత్రం ఎలా ఒప్పుకుంటాడు? అప్పటికీ నేనెంతో చెప్పిచూశాను. లాభంలేకపోయింది.

రా.భ: ఐతే మీకు అక్కర్లేని సంబంధం నన్ను చేసుకోమంటారన్నమాట.

గంట: అదేకాదండీ నా బాధ, కరవమంటే కప్పకి కోపం. విడవమంటే పాముకి కోపం. ఏమో బాబూ. మీ ఇష్టం. నానోటితో మాత్రం నేనేమీ చెప్పను.

లోపల గుండమ్మ,లక్ష్మి, సరోజకి అలంకరణ చేస్తూవుంటారు.

సరోజ: ఏవిఁటమ్మా ఇది? నేనేం సంతలో గొడ్డుననుకున్నారా? వచ్చినవాళ్ళంతా చూసి పోవడానికి? నే రాను.

గుండ: ఈ ఒక్కసారికేనమ్మా. నామాటవిను. ఇంక నిన్నెవరికీ చూపించను. నా అమ్మవికదూ? నా తల్లివికదూ?

సరోజ−− conditionalగా: ఐతే మీరెవ్వరూ రావద్దు. నేనేపోయి మాట్లాడి వస్తాను.−− మేడమెట్లు దిగివస్తుంది.

గంట: చూడండి. పిల్ల బంగారపు బొమ్మ. —సరోజ రోషంగా చూస్తుంది.

రా.భ:చూసి——చాలుచాలు.

గంట: అమ్మాయిని ఏమైనా అడగండి.

రా.భ: అమ్మాయ్.నీ పేరేమిటి?

సరో:విసురుగా——సరోజ.

రా.భ: మంచిపేరే. ఎంతవరకు చదువుకున్నావ్?

సరో: గొంతువరకు.

రా.భ: వెటకారంగా––అబ్బో.చాల పెద్ద చదువే.

గంట: మేష్టర్ని పెట్టి సంగీతం కూడా చెప్పించారు. హార్మోనీపెట్టెమీద వాయిస్తుంది.

సరో: పాటకచ్చేరికూడ చేస్తాను.

రా.భ: ఐతే ఇకనేం? స్కూలు పెట్టుకోవచ్చు. (రెచ్చగొడుతూ) ఫొటొలో పిల్ల ఇంత నల్లగా లేదే?

సరో–పౌరుషంగా: కాస్త కళ్ళజోడు తీసి చూడండి. —గిరుక్కున తిరిగి వెళ్ళిపోతుంది.

గంట——సానుభూతిగా: పాపం! దాని తప్పేముంది? రోజుకొకడు రావడం, చూడ్డం, పోవడం .

రావడం, చూడ్డం, పోవడం .దానికి ముక్కుమీదుంటుంది కోపం. రోషం జాస్తి. పెద్దపిల్ల ఉంది చూశారూ. కొట్టు–కొయ్యి. నోరు తెరవదు.

రా.భ: చాలా ఓపికగల పిల్లలాగేవుంది. జీతమెంతిస్తారో? (అన్నీ తెలిసి కూపీ లాగటం!)

గంట: జీతమా పాడా? పనిమనిషైతే ఏనాడొ పారిపోయి ఉండేది. గుండమ్మ మారుకూతురు.

రా.భ: ఓహో. మరి ఆ పిల్ల మాటేం చేశారు?

గంట: ఆс. దానిపెళ్ళిదేముందిలెండి. కట్నాలా కానుకలా? అసలు పెళ్ళి ఖర్చులే దండగనుకుంటుంటే? ఏ దిక్కులేనివాడికో ఇచ్చి ముడిపెట్టేస్తాం. పెట్టింది తిని పనీపాటా చేస్తూ వాడే పడివుంటాడు. కొంపదీసి ఆ పిల్లని చేసుకుంటారేవింటి? చూస్తూచూస్తూ ఇంత కలిగిన సంబంధాన్ని ఆ పిల్ల కిచ్చి చేస్తుందా ? మా గుండమ్మ చస్తే ఒప్పుకోదు. కళ్ళల్లో నిప్పులు పోసుకోదూ?——

గుండమ్మ మేడదిగివస్తుంది. వినయంగా చేతులుజోడించి. : ఈ రోజు దానికి ఒంట్లో బాగాలేదండి. చిరాగ్గావుంది.

గంట: దానిసంగతంతా చెప్పేశాను చెల్లాయ్. ఇల్లరికం ఉండనిదే లాభం లేదనికూడా చెప్పేశాను.

గుండ: మా అబ్బయి పై చదువుకి వెళ్ళాడు. అమ్మాయికి పెళ్ళి చేసి అల్లుణ్ణి ఇంట్లో పెట్టుకుని ఆస్తంతా వాళ్ళకే ఇచ్చేద్దామనివుంది . మావారుకూడా ఒప్పుకునే ఇలా వచ్చారు,.

రా.భ: సోఫాలోంచి లేస్తాడు చేతికర్ర తీసుకుని. —

గంట; ఇంతకూ పిల్ల నచ్చినట్లేనా?

రా.భ: నాదేముంది? అబ్బాయిని కనుక్కోవాలిగా? వాడితో మాట్లాడి... మరి వస్తాను.

★★★

రామభద్రయ్య కొడుకులిద్దరూ తండ్రి రాగానే లేచి నిలబడతారు.

రాజా: నాన్నా. వెళ్ళిన పనేమయింది? కాయా పండా?

రా.భ: ఆс. కాయాకాదు.పండూకాదు. ఇదేం జరిగేటట్టులేదురా.

రాజా: ఏం?

ఆంజనేయ ప్రసాద్: పిల్లలు నచ్చలేదా?

రా.భ: ఓ మాదిరి నచ్చారనుకో. –అందరూ సోఫాలో కూర్చుంటారు. : పెద్దపిల్ల మారుతికూతురు. పేరు లక్ష్మి. సాక్షాత్తు లక్ష్మిలాగే వుంటుంది. పనులన్నీ చక్కగా చేసుకుంటుంది. చాలా ఓర్పుగల పిల్ల కూడాను. ఆంజనేయ ప్రసాద్‌తో—ఒరే . నీతో వేగాలంటే ఆ పిల్లకే తగును.

ఆంజ: చూశావా తమ్ముడూ.నాకు ఓర్పులేదట! నాన్నగారికి నువ్వంటేనే ఇష్టం.

రాజా: ఏం నాన్నా. ఆ పిల్లని అన్నయ్యకిచ్చి చెయ్యకూడదూ?

రా.భ: చేసుకోవచ్చు కాని గుండమ్మ ఒప్పుకోదుగా? ఎవడో పనీపాటా చేసుకునేవాడికిచ్చి ఇంట్లోనే పెట్టుకోవాలని చూస్తోంది.

ఆంజ: పోనీ పనివాడిలాగేవెళ్ళి చేసుకుంటే సరి! పిల్లనచ్చితే దారే దొరక్కపోతుందా? ఆ సంగతి నేను చూసుకుంటాను.

రా.భ: సరే అలాగే కానివ్వండి. ఇక రెండో అమ్మాయి. పిల్ల బాగానేవుంటుంది. కాని నాథుడులేని కొంప. అంతా ఆడపెత్తనం. తల్లి అతిగారాబంగా పెంచింది. పిల్ల రోషం గలది. దాన్ని దార్లో పెట్టుకుంటే మంచిపిల్లే.

రాజా: అది చేసుకునేవాడినిబట్టి ఉంటుందినాన్నా. రౌతుకొద్దీ గుర్రం. మీకు నచ్చితే చెప్పండి. చేసుకుని దార్లోకి తెస్తాను.

ఆంజ: Very good! మగసిరైనమాట. బాగాచెప్పావు తమ్ముడూ.

రా.భ: కాని అల్లుడు ఇల్లరికం రావాలంటుంది తల్లి. పిల్లకూడా తల్లిని వదిలి రాదేమో?

రా.భ: రాకపోతే రప్పిస్తాం. మీకెందుకు? మీరు ఔననండి. మీకు నచ్చేట్టుగా చేసి మీ కాళ్ళముందు పడేస్తాను.

రా.భ: నాకు నీమీద ఆ నమ్మకం వుందిలే. ఏదైనా తలుచుకుంటే సాధించే ఓర్పుకూడవుంది నీకు.

ఆంజ: నాకేనా ఓర్పులేనిది? ––లేస్తాడు.అందరూలేస్తారు.

రా.భ: అహ్హహ్హ. తెలుస్తూనేవుందిగా? –రాజాతో—ఇదుగోరా చిన్నమ్మాయి ఫొటొ. కాని ఇంకొక్క సంగతి. ఆ ఇంటికి గంటయ్య అని ఒక శనిగాడు దాపురించాడు. వచ్చిన సంబంధమల్లా చెడగొట్టి చిన్నపిల్లని జైల్లోవున్న తనకొడుక్కి చేసుకుందామని చూస్తున్నాడు. ఆంజ: ఆఁ. వాడి సంగతి నేను చూసుకుంటాగా. ఏం తమ్ముడూ?

రాజ: ఓకే.

రా.భ: అలాగే. మీరాపిల్లలని చేసుకుంటే చనిపోయిన నా స్నేహితుడి ఆత్మకూడా శాంతి స్తుంది.

ఆంజ: అలాగేనాన్నా.

★★★

రాజా సూటుబూటులో బంధువులింటికి వస్తాడు. –వెనక నౌకరు మూటముల్లె తెస్తూ—

పద్మ: అమ్మా. అన్నయ్యొచ్చాడె.

తల్లి: పిల్లని చూడ్డానికి వచ్చావా? మరి నువ్వొక్కడివే వచ్చావా? అన్నయ్య రాలేదా?

రాజా: వచ్చాడు. వాళ్ళింటికి వెళ్ళాడు. నాకు మీ సహాయం కావాలి. నేను ఒక నాటకం ఆడబోతున్నాను. నేను సరోజని కలవాలి.

పద్మ:ఆఁ.తెలుసు. వాళ్ళన్నయ్య నా క్లస్మేటే.

రజ: ఆ పిల్లని నేనొకసారి చూడాలి.

పద్మ: అలాగే.

రాజా: కాని నేనా పిల్లని చూడ్డనికి వచ్చినట్లు వాళ్ళకిమాత్రం తెలియకూడదు సుమా.

పద్మ: అలాగే అన్నయ్యా.

★★★

హొటల్లో—చొక్కా,నిక్కరు, తలపాగా, భుజానికి సంచితో పనివాడి వేషంలో ఆంజనేయ ప్రసాద్. తిని చొక్కాతో మూతి తుడుచుకుని బైటికి పోబోతుంటే –ప్రొప్రైటర్: ఏయ్యేయ్.

ఆంజ:ఏయ్?

ప్రొప్ర: డబ్బులేవీ?

ఆంజ: లేవు.

ప్రొప్ర: లేకపోతే టిఫిన్ ఎలా తిన్నావ్?

ఆంజ: ఆకలేసింది.తిన్నా.

ప్రొప్రు: ఆ పప్పులేం ఉడకవ్. నా డబ్బులిస్తేగాని కదలడానికి వీల్లేదు.

ఆంజ;అట్లనా. ఐతే నేనిక్కడే కూర్చుంటాను.

ప్రొప్ర: లేచివచ్చి——దబ్బులిస్తావా? తీసుకోమంటావా?

ఆంజ: తీసుకో చూద్దాం. —ప్రొప్రయిటర్ చెయ్యి మెలేస్తాడు. వాడు లబోదిబోమంటాడు. అంతలో గంటయ్యని చూసి:చూడు గంటయ్యా. తిని డబ్బులివ్వకుండా పోతున్నాడు.

ఆంజ: ఓ.గంటయ్యగారా? Salute చేస్తాడు.

గంటయ్య పట్టించుకోకుండా: ఏరా.

ఆంజ: ఒరేగిరే అంటే జాగ్రత్త.

గంట:: ఏం చేస్తావోయ్.——ఆంజ——అతని చెయ్యి మెలేస్తాడు. గంటయ్య సంబాళించుకుని——అదికాదు.తిని డబ్బులివ్వకుండాపోతే ఎలా చెప్పు?

ఆంజ: లేవు. ఉంటే ఇవ్వనూ? ఏదైనా పనుంటే చెప్పు. చేస్తా.

గంట; ఐతే నాతో రా.

ఆంజ: ఎక్కడికి?

గంట: మా చెల్లెలిగారింటికి.

ఆంజ: వాళ్ళూ నీలాంటోళ్ళేనా? లేకపోతే మర్యాద తెలుసా?

గంట: మర్యాదకేం? పెళ్ళికొడుకులా చూస్తారు.

ఆంజ: ఐతే పెళ్ళికూడా చేస్తారా?

గంత: ఓ! అదికూడా చేయిస్తాను. రా.

ఆంజ: ఐతే పద. —గంటయ్య ముందుదారితీయగా ఆంజ——జేబులోంచి డబ్బుతీసి ప్రొప్రయిటరుకి ఇస్తాడు.ప్రొప్రయిటరు ఆశ్చర్యంగా చూస్తాడు.

★★★

(సశేషం)

COMMENTS